ఉండవల్లి అరుణకుమార్

# విభజన కథ

నా డైరీలో కొన్ని పేజీలు

ఒక సాక్షి... పాత్రధారి కథనం

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | వివిధ పార్టీల పాత్ర | 7 |
| 2. | కె.సి.ఆర్. తో ముఖాముఖీ : 20-7-2005 | 12 |
| 3. | 2009 | 15 |
| 4. | వై.ఎస్. మరణానంతరం | 20 |
| 5. | పోలవరం ప్రాజెక్ట్ - సోనియాగాంధీ 10.12.2009 | 30 |
| 6. | సీమాంధ్రలో ఆందోళన - లోక్‌సభలో ప్రస్తావన | 34 |
| 7. | నా డైరీలో... | 38 |
| 8. | 2014 ఎన్నికల ఫలితాలు | 127 |
| 9. | లోక్‌సభ | 129 |
| 10. | లోక్‌సభ ప్రొసీడింగ్స్: 18-2-2014 | 141 |
| 11. | రాజ్యసభ 20.2.2014 | 167 |
| 12. | నేపథ్యంలో ఏం జరిగి ఉంటుంది? | 230 |
| 13. | ఎందుకిలా జరిగింది! | 233 |
| 14. | ఇదంతా ఎందుకంటే... | 253 |
| 15. | విభజన చట్టంలో | 254 |
| 16. | సుప్రీంకోర్టులో... | 264 |
| 17. | అరణ్యరోదన | 267 |
| అనుబంధాలు | | 269 |

# వివిధ పార్టీల పాత్ర

**కాంగ్రెస్ పార్టీ**

'ప్రత్యేక తెలంగాణ' నినాదం మొదలుపెట్టింది కాంగ్రెస్ నాయకులే!

స్టేట్ రీ ఆర్గనైజేషన్ కమీషన్ (ఫజల్ ఆలీ కమిషన్) 1954–55 ముందు హాజరై తెలంగాణ వేరే రాష్ట్రంగా ఉంచాలనీ ఆంధ్రతో కలపకూడదని వాదన విన్పించింది.. నాటి కాంగ్రెస్ నాయకులే! ఆ రోజుల్లో కాంగ్రెస్ – కమ్యూనిస్టు పార్టీలే ప్రధాన పార్టీలు. కమ్యూనిస్టులు ఏకగ్రీవంగా 'విశాలాంధ్ర'ని కోరుకుంటే, కాంగ్రెస్‌లో ఒక వర్గం మాత్రం తెలంగాణ వేరుగా ఉంచాలని బలంగా కోరింది.

ఆరోజుల్లో దేశం మొత్తం మీద కాంగ్రెస్‌కున్న పలుకుబడి కారణంగా ఆంధ్ర, తెలంగాణ ప్రాంత నాయకుల్ని కూర్చోబెట్టి 'జెంటిల్‌మెన్ ఎగ్రిమెంట్' పేరిట ఇద్దర్నీ కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పరిచారు.

1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పెద్ద ఉద్యమం నడిపించింది, దానికి నాయకత్వం వహించింది కూడా కాంగ్రెస్ వారే! 1971 పార్లమెంట్ మధ్యంతర ఎన్నికలలో తెలంగాణ ప్రజాసమితి పేరుతో, ఈ నాయకులే కాంగ్రెస్ నుంచి బైటకొచ్చేసి, పోటీ చేసి తెలంగాణలో విజయం సాధించారు. ఇందిరాగాంధీ కొత్త కాంగ్రెస్ 'ఆవు–దూడ' గుర్తుతో దేశమంతటా విజయదుందుభి మ్రోగించినా, తెలంగాణలో మాత్రం చతికిలపడింది. అయినా, తన పాత సహచరులు, అనుచరులు అయిన తెలంగాణ ఎంపీలందర్నీ కూర్చోబెట్టి, ఇందిరమ్మ కలిసుండటానికి ఒప్పించారు. అంతేకాదు.. ప్రజాసమితిని కాంగ్రెస్‌లో విలీనం కూడా చేయించారు. ఆ సమయంలోనే, ఆంధ్ర ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిని రాజీనామా చేయించి తెలంగాణ ప్రాంతానికి చెందిన పి.వి. నరసింహారావును ముఖ్యమంత్రిని కూడా చేసారు. 1972 అసెంబ్లీ ఎన్నికలలో ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ మూడు ప్రాంతాలలో కాంగ్రెస్ విజయం సాధించింది. 219 అసెంబ్లీ స్థానాలు గెలిచి రాష్ట్ర చరిత్రలో రికార్డు స్థాపించింది. ఈ రికార్డు, ఎన్టీ రామారావు కూడా 'బ్రేక్' చెయ్యలేకపోయారు.

# కె.సి.ఆర్. తో ముఖాముఖీ : 20-7-2005

గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో రాజమండ్రి నుంచి హైదరాబాద్ చేరుకున్నాను. 'బేగంపేట' విమానాశ్రయానికి వెళ్లి, ఢిల్లీ విమానంలోకి 'చెక్ ఇన్' అయ్యాను. మొదటి రెండు సీట్లూ ఖాళీగా ఉన్నాయి. 'ఎవరో మంత్రి వస్తున్నారన్నమాట!' అనుకుని మూడో వరసలో నాకు కేటాయించిన సీట్లో కూర్చున్నాను. సరిగ్గా విమానం బయలుదేర బోతుండగా ఇద్దరు మంత్రులు ముందు వరసలో ఆ రెండు సీట్లలో వచ్చి కూర్చున్నారు. ఒకరు కేబినెట్ మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు, మరొకరు సహాయ మంత్రి ఆలె నరేంద్ర. నేను అప్పుడే కొత్తగా ఎంపీని అయ్యాను. నా మొహం చూసి గుర్తుపట్టేంత చనువు ఆ ఇద్దరికీ లేదు. నరేంద్ర గారిని అంతకుముందు కలిశాను. ఆయన పలుకరింపుగా నవ్వారనిపించింది. అయితే అది నన్ను చూసో, మరెవ్వరినైనా చూసో అనుకున్నాను.

విమానం బయలుదేరిన అరగంటకి నరేంద్రగారు నా సీటు దగ్గరకు వచ్చారు. 'అరుణ్! కేసీఆర్ పిలుస్తున్నారు' అంటూ నన్ను ముందు సీట్లోకి వెళ్లమని, అతను నా సీట్లో కూర్చుండిపోయారు. నేను వెళ్లి కేసీఆర్ పక్క సీట్లో కూర్చున్నాను. 'మీరు రాజమండ్రి ఎంపీ అని ఇప్పుడే నరేంద్రగారు చెప్పారు' అంటూ పలకరించారు. నన్నెందుకు పిలిచారో, నాతో ఏం మాట్లాడాలనుకుంటున్నారో నాకర్థం కాలేదు. అయితే ఆయన పలకరింపు మాత్రం చాలా ఫ్రెండ్లీగా అనిపించింది. తర్వాత గంటంపావు మేం మాట్లాడుకుంటూనే ఉన్నాం. మేం మాట్లాడుకున్నాం అనడం కన్నా, ఆయన మాట్లాడారు, నేను వింటూ ఉన్నాను అనడమే కరెక్ట్. ఢిల్లీలో విమానం ల్యాండ్ అయ్యేవరకూ ఆయన చెబుతూనే ఉన్నారు. 'బ్రెయిన్‌వాష్' అనే పదం ఎక్కువగానే విన్నాను గానీ, అది ఇలా ఉంటుందని ఆయనతో కూర్చుంటేనే తెలుస్తుంది. మామూలుగా పబ్లిక్ మీటింగుల్లో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఎంత నష్టపోయిందో ఆయన చెబుతుంటారు. ఆరోజు మాత్రం ఉమ్మడి రాష్ట్రం వల్ల కోస్తా, రాయలసీమలు ఎంత నష్టపోతున్నాయో చెప్పటం మొదలుపెట్టారు. నేనాశ్చర్యపోయాను. గోదావరి, కృష్ణా నదుల నీరెంత, ఎవరెంత వాడుకుంటున్నారు, గోదావరి జిల్లాలకెంత అన్యాయం